క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యటన

ఇబ్రహీంపట్నం: మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం పర్యటించనున్నట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం మంచాల మండలం చెన్నారెడ్డిగూడలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, ఆరుట్లలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొంటారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ చేస్తారు. ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో వాణిజ్య దుకాణాల సముదాయాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించనున్నట్లు వివరించారు.

పార్టీ శ్రేణులు తరలిరండి

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవాలు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు ఎమ్మెల్యే అందజేస్తారని వివరించారు. ఆయా కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, నాయకులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాస్ ముదిరాజ్

యాచారం: మండల పరిధిలోని మాల్ గ్రామంలో బేడ బుడగ జంగాల కాలనీలో శ్రీ ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్‌ముదిరాజ్ ఆర్థికసాయం చేశారు. సోమవారం ఆయన ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి భవిష్యతులో మరింత సహాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాజు, శ్రీనివాస్, మురళి, శివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

యాచారం: మండల కేంద్రంలో ఈ నెల 21న యోగా డే సంబంధించి సోమవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యం కాపాడుకోవడం కోసం ప్రతి మనిషికి యోగా ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ నెల 21న యోగా డేలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిస్తూ ర్యాలీ నిర్వహించారు.

సొంత డబ్బుతో డ్రైనేజీ పనులు



డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కడ్తాల్: మండల పరిధిలోని మక్తమాధారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తన సొంత డబ్బులతో గ్రామంలో 100 మీటర్ల డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. సొంత డబ్బులతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు శ్రీనివాస్‌గౌడ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి, మాజీ ఉప సర్పంచ్ గణేశ్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



ఆమనగల్లు: మండలంలోని పోలేపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

- ప్రభుత్వ నిర్ణయంతో చిగురిస్తున్న ఆశలు
- రిజర్వేషన్లు కలిసొస్తే పోటీ చేయడానికి కసరత్తు
- గ్రామాల్లో మొదలైన దావత్‌లు



నస్దిక్‌సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయం

యాచారం: పల్లెల్లో మళ్లీ ఎన్నికల సందడి నెలకొంది. ఏడాదిన్నరగా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు లేక ప్రజాపాలన పూర్తిగా గాడి తప్పింది. ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ వారు గ్రామాల వైపే కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో సమస్యలు ఎవరికీ చెప్పుకోవాలో అర్థంకాక ప్రజలు సతమతమవుతున్నారు. తాజాగా ప్రభుత్వం స్థానిక సంస్థల పోరుకు సుముఖత వ్యక్తం చేయడంతో గ్రామాల్లో ఆశావహుల హడావుడి మొదలైంది.

ఆత్మీయ పలకరింపులు

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలుంటాయని సర్కార్ నుంచి సాంకేతాల వస్తున్న నేపథ్యంలో పోటీదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రిజర్వేషన్లు కలిసొస్తే అదృష్టం పరీక్షించుకోడానికి నేతలు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే నిత్యం గ్రామాల్లో తిరుగుతూ.. వరుసలు బెట్టి అన్నా.. తమ్ముడూ.. అక్కా.. చెల్లి.. చిన్నమ్మా.. బాబాయ్.. బాగున్నావా అంటూ ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇలాంటి పలకరింపులు నాలుగైదు రోజులుగా అధికమయ్యాయి. గల్లీల్లో యువతను మచ్చిక చేసుకోవడం కోసం దావత్‌లు ఇస్తున్నారు. ముందు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలుంటాయనే ప్రచారంతో రిజర్వేషన్లు కలిసొస్తే పోటీకి ఆశావహులు సై అంటున్నారు. కొందరైతే వ్యాపార, ఉద్యోగ రీత్యా నగరంలో నివాసం ఉంటున్న వారికి ఫోన్లు చేస్తూ పలకరిస్తున్నారు.

పెద్దఎత్తున నిధుల సమీకరణ

మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 14 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానం ఉంది. ఎన్నికల్లో పోటీ చేయాలంటే దండిగా నిధులు అవసరమయ్యే అవకాశం ఉంది. దీంతో ఆశావహులు నిధుల వేటలో పట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తే డబ్బులు సమీకరణ చేసుకోవడం పెద్ద కష్టంగా మారుతుందనే భయంతో పోటీదారులు ముందు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అప్పులు తెచ్చుకోవడమా.. లేక ప్లాట్లు, భూములు రిజిస్ట్రేషన్లు చేసి వడ్డీలకు తెచ్చుకోవడమా.. స్థిరాస్తిని పూర్తిగా అమ్ముకోవడమా అనే ఆలోచనలో పడ్డారు. మండలంలోని 23 రెవెన్యూ గ్రామాలకు గాను 20 ఫ్యూచర్‌సిటీ పరిధిలోకి తీసుకున్న నేపథ్యంలో ఆయా పల్లెల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు ఉంటాయా.. ఉండవా అనే ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది.

సిద్ధంగా ఉన్నాం



ప్రభుత్వం ఎన్నికలను ఎప్పుడు నిర్వహించాలని నోటిఫికేషన్ ఇచ్చినా పంచాయతీ సిబ్బంది రెడీగా ఉంది. గతంలోనే ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీ లేకపోవడం ప్రజలకు ఇబ్బంది అవుతుంది. అన్ని తామై పంచాయతీ కార్యదర్శులు పాలన చేస్తున్నారు.

– శ్రీలత, ఎంపీఓ, యాచారం

గుంతల రోడ్డును బాగు చేయండి

బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



ఆగాపల్లి- జాపాల్ రోడ్డును పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంచాల: వాహనాల రాకపోకలకు ఆగాపల్లి–జాపాల్ రోడ్డు పెద్ద అవరోధంగా మారిందని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. నిత్యం గుంతల రహదారితో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని జాపాల గ్రామంలో ఆగాపల్లికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేసిందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. కానీ ఇంతవరకు పనులు పూర్తి కాలేదని విమర్శించారు. ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదన్నారు. పెద్ద గోతులతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇటీవల వర్షాలకు మరింత అధ్వానంగా మారిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సతీష్, చంద్రకాంత్, బుగ్గ రాములు, నాగరాజు, సంజీవ, పవన్‌కుమార్, రాజు, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం రూరల్: భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రభుత్వ నిర్వహిస్తుందని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డి తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో సోమవారం దండుమైలారం గ్రామంలో రెవెన్యూ సదుస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలకు చక్కటి అవకాశమన్నారు. రెవెన్యూ అధికారులే గ్రామాలకు వస్తున్నందున లిఖితపూర్వకంగా వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని సూచించారు. గ్రామంలో సుమారు 107 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగుళూర్‌లో జరిగిన సదస్సులో 11 అర్జీలు అందినట్లు చెప్పారు.

53 దరఖాస్తులు

ఆమనగల్లు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమనగల్లు తహసీల్దార్ లలిత కోరారు. ఆకుతోటపల్లిలోని రైతువేదికలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 53 దరఖాస్తులను స్వీకరించారు.



ఆమనగల్లు: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్

నేడు ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఖాల్సా రెవెన్యూ సదస్సును మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఓసీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సునీతారెడ్డి తెలిపారు. ఖాల్సా రెవెన్యూ పరిధిలోని చర్లపటేల్‌గూడ, కర్ణంగూడ, ఉప్పరిగూడ గ్రామాలతో పాటు ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో భూ సమస్యలున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'రైతునేస్తం' వీక్షించిన అన్నదాతలు

యాచారం: వానాకాలం రైతు భరోసాపై సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న రైతునేస్తం కార్యక్రమాన్ని స్థానిక రైతులు విన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన టీవీలో సీఎం ప్రత్యక్ష ప్రసారాన్ని అన్నదాతలు చూశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, మండల వ్యవసాయాధికారి రవీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులు చూశారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఏడీఏ సుజాత, తహసీల్దార్ వెంకటప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఏఓ కృష్ణ మోహన్ రైతులు తిలకించారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు, ముద్విన్, రావిచేడ్ గ్రామాల్లోని రైతు వేదికలలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సీఎం ప్రసంగాన్ని వీక్షించడంతో పాటు, వ్యవసాయ రంగా అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల వివరాల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



మంచాల: కార్యక్రమాన్ని చూస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి తదితరులు



కడ్తాల్: సీఎం ప్రసంగాన్ని వీసీ ద్వారా తిలకిస్తున్న రైతులు



యాచారం: రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రోగ్రాంని చూస్తున్న రైతులు

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని గడ్డమీదితండా గ్రామ పంచాయతీకి చెందిన జరుపుల దేవానాయక్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు ఉన్నారు.

పార్కు స్థలాలను కాపాడుతాం



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

తుర్కయంజాల్: పార్కు స్థలాలు కబ్జా అంటూ ఈ నెల 15న సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్‌రెడ్డి స్పందించారు. సోమవారం కమ్మగూడ సర్వే నంబర్ 227, 228లోని 870 గజాల పార్కు స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ వెంచర్‌కు సంబంధించిన పూర్తి స్థాయి డాక్యుమెంట్‌లను పరిశీలించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనార్థం వదిలిన భూములను ఎవరైనా అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరిస్తాం



పబ్లిక్ స్కూల్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంఈఓ రాందాస్ తదితరులు

మంచాల: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎంఈఓ రాందాస్ అన్నారు. సోమవారం మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్(ప్రాథమిక, ఉన్నత, మోడల్ మూడింటిని కలిపి)ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు కొత్తగా 500లకు పైగా అడ్మిషన్లు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను నియామకం చేయాలని, అదే విధంగా కొత్తగా వచ్చే అడ్మిషన్లు కూడా తీసుకోవాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్, ఉపాధ్యాయులు కిషన్, పాపిరెడ్డి, పేరెంట్స్ కమిటీ సభ్యులు భాస్కర్, రాము, శ్రీశైలం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కేశంపేట: భూ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు నాయకులతో కలిసి ఆమె భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెంచుల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం చెంచుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శంకరకొండతండాలో ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో నిర్మించే గిరిజన కమ్యునిటీ భవనం నిర్మాణానికి రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు మండ్లి రాములుతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. గిరిజనులు, చెంచుల అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. వ్యవసాయ భూమి కలిగిన చెంచులకు బోరుమోటార్ అందిస్తున్నామన్నారు. ఇటీవల ప్రభుత్వం ఇందిర సౌర గిరి జలవికాస పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని చెప్పారు. గత ప్రభుత్వాలు చెంచుల సంక్షేమాన్ని విస్మరించాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సామాజిక న్యాయం సాధ్యమని ఆయన చెప్పారు. అన్ని గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు చెంచురాములు, అనితవిజయ్, పత్యానాయక్, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, ఫరీద్, బాబా, ఐటీడీఏ డీఈఈ సత్యానందం, ఏఈ నిత్యానందస్వామి, ఎంపీడీఓ కుసుమమాదురి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారానికే భూ భారతి

కడ్తాల్: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకువచ్చిందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గతంలో ధరణి పోర్టల్ ద్వారా రైతులు చాలా ఇబ్బందులు పడ్డారని, అందుకే భూభారతి తీసుకొచ్చామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ముంతాజ్, డీటీ ఆదిత్యరాజు, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు బీచ్యానాయక్, నరేశ్‌నాయక్, వెంకటేశ్, చందోజీ, జగన్, రాంచందర్, మల్లేశ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, కృష్ణ, ఆర్‌వి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: కమ్యునిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

నేత్ర దానానికి ముందుకు రావాలి

ఆమనగల్లు: నేత్రదానం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి కోరారు. తమ మరణానంతరం నేత్రదానం చేయడంతో ఇద్దరికి చూపు ప్రసాదించవచ్చని చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధత్వ నివారణే ధ్యేయంగా లయన్స్‌క్లబ్ పనిచేస్తుందని చెప్పారు. నేత్రదానం, రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో కంటి వైద్యుడు చంద్రశేఖర్ 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 45 మందిని కంటి ఆపరేషన్ కోసం మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ యాదయ్య, కార్యదర్శి శ్రీను, పీఆర్‌ఓ పాషా, సభ్యులు బాలకృష్ణ, వెంకటయ్య, సుధీర్‌రెడ్డి, ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి మంజులాదేవి, సిబ్బంది తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి

నేత్ర వైద్య శిబిరం

కడ్తాల్: మండల కేంద్రంలో లయన్స్ కంటి ఆస్పత్రి కడ్తాల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్యుడు పవన్‌కుమార్‌రెడ్డి బృందం 46 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 21 మందికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించింది. అనంతరం కంటి వారిని ప్రత్యేక వాహనంలో లయన్స్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి ఎనుగొండకు పంపించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, వైద్య సిబ్బంది రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

కమిషనర్ సరస్వతి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసుకొని మహిళలు స్వయం శక్తితో ఎదగాలని కమిషనర్ పి.సరస్వతి సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం 16వ రోజు మున్సిపల్ పరిధి 21వ డివిజన్‌లోని డ్వాక్రా భవనంలో పొదుపు సంఘాలకు సమావేశం నిర్వహించి మహిళలకు స్వయం సంమృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసక్తి గలవారు విధి విక్రేతలు గ్రూపులుగా ఏర్పడితే తప్పకుండా ప్రభుత్వం తరఫున వారికి పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మీ ఇంటి ముందుకు వస్తున్న స్వచ్ఛ ఆటోల్లో వేయాలని కోరారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా అందరం కలిసి నిర్మించుకుందామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్‌సుందర్, డీఈఈ వెంకన్న, ఆర్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, టీఎంసీ శంకర్, ఈఈ మౌనిక, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు, మహిళా గ్రూపు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరిన 11కేవీ లైన్ సమస్య

- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ ఎల్లమ్మగడ్డ కాలనీలో సుమారు 30 ఇళ్లు, ప్లాట్ల నుంచి 11కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఉన్నాయి. ఎట్టకేలకు ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారమైనందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీన గ్రామంలో అంగన్‌వాడీ భవన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అందరూ కలిసి ఆయనకు ఇళ్ల పైనుంచి హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ అధికారులు గ్రామంలో పర్యటించి విద్యుత్ లైన్‌ను మార్చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలో కొత్త రూట్‌లో హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. హైటెన్షన్ లైన్ పనులను జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల శ్రావణ్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పరిశీలించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలేమోని శివయ్య, అబ్బి సుందరయ్య, పల్లాటి లక్ష్మీనారాయణ, కుర్వగూడెం నర్సింలు, పర్వతాలు, చెవేళ్ల నర్సింలు, యాదయ్య, సుదర్శన్‌గౌడ్, రాఘవేందర్, దేవేందర్, కుమ్మరి శేఖర్, సూరమోని యాదయ్య, సిల్వేరు రవీందర్, రామకృష్ణ, రాంచందర్, శాంతయ్య, శ్రీను పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- కాంగ్రెస్ సీనియర్ నేత శేఖర్‌రెడ్డి

కొత్తూరు: మారుతున్న సమాజానికి అనుగుణంగా ప్రస్తుత పోటీ రంగంలో చదువుకుంటేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండలంలోని సిద్ధాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత ఎల్లారం శేఖర్‌రెడ్డి అన్నారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన బడిబాటతో పాటు హెచ్‌ఎండీఏ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుతుందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించి విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంతో పాటు నిరుద్యోగులకు అన్ని విధాలుగా సాయం చేసేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కేంద్రాల ద్వారా నిరుద్యోగులకు అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.